

# మారిన గుండె కారిన రక్తపు బొట్లు

— కొమ్మూరి వేణుగోపాలరావు —

"ఏమండీ! నన్ను క్షమించరూ ?"

కిటికీ తెరల్ని ప్రక్కకు తొలగించి, యిరువైపులా వున్న చెట్లమీదనుండివీస్తోన్న చల్లగాలిని అనుభవిస్తూ, హాస్పటల్ లాన్స్‌వైపు తిలకిస్తూన్న శేఖర్ ఉలికిపడి వెనుదిరిగాడు.

మల్లెపందిరి లాంటి ప్రక్కమీద మల్లె మొగ్గలా పడుకునివున్న పద్మ కళ్ళలో నీళ్ళు తిరుగుతున్నాయి. నిర్మలమైన బుగ్గల మీద స్వచ్ఛమైన కన్నీరు అమాయకంగా మెరుస్తోంది.

శేఖర్ విహ్వాలదృష్టితో ఆమె వైపు

చూసి "పద్మా!" అంటూ ఆత్రుతగా మంచం దగ్గరకు వచ్చాడు. అతని మనస్సులోని పంచరంగుల చిత్రం అప్పటికప్పుడు చెరిగిపోయినట్లయింది. కళ్ళముందు కదిలిన అందమైన లాన్స్ స్మృతిపథంలోకి జరిగిపోయాయి.

"అవునండీ! నన్ను క్షమించరూ?"

అతను చప్పున మంచంమీద ఆమె ప్రక్కగా కూర్చుని నుదుటిమీద పడుతూన్న ముంగురుల్ని సవరిస్తూ "ఏమిటా మాటలు పద్మా! నువ్వేం చేశావని?" అన్నాడు అనునయంగా.

పద్మ అతని కళ్ళలోకి సూటిగా చూసింది. ఆ కళ్ళలో ఆమెకు దేవేంద్ర లోకాలు కనిపించాయి. వాటి చూపులు అక్కడి అమృతపు జల్లులు.

"నేనేం చేశానో...నాకు తెలుసు" పద్మ పెదవులమీద మలినపూరితమైన చిరునవ్వొకటి మెదిలింది. "నా తలిదండ్రులకూ తెలుసు...తర్వాత మీకూ తెలుసు. దేముడిలాంటి మిమ్మల్ని అసలు విషయం చెప్పకుండా మభ్యపరిచి, అప్పటికి అయిదారేళ్ళుగా గుండెజబ్బుతో బాధపడుతూన్న నన్ను మీ కంటగట్టి మీ జీవితాన్ని నాశనం చేశారు. నిజం చెప్పండి... మీరు... నన్ను చేసుకుని...ఏం సుఖం..."

"నిజం చెబితే నమ్ముతావా?"

"నన్ను మభ్యపెట్టటానికి అబద్ధాన్ని నిజంగా రూపం దిద్ది వంచించటానికి మాత్రం ప్రయత్నించకండేం."

సున్నితమైన శేఖర్ వ్రేళ్ళు ఆమె సుకుమారమైన చేతిలో మృదువుగా ఇరుక్కున్నాయి. అతను విడిచిన నిట్టూర్పు ఆమెకు తెలియలేదు.

"చెప్పండి" అన్నది మళ్ళీ ఆమే మెత్తగా నవ్వి.

"నిజాన్ని గ్రుచ్చి గ్రుచ్చి అడిగినపుడు అది చెప్పటం ఎంత కష్టమో ఇప్పుడు తెలుసుకుంటున్నాను!

అతని సమాధానానికి ఆమె ముఖంలో సంతృప్తి చిహ్నాలేమీ కనిపించలేదు. ఒక నిమిష మాగి మళ్ళీ అడిగింది: "చూడండి. మీరు నన్నెప్పుడూ ద్వేషించలేదూ?"

"నిన్ను ద్వేషించటం-నేనింకా నేర్చుకోవాలి పద్మా."

"మిమ్మల్ని చూస్తే జాలేస్తోందండీ. ఆ కోరిక యిహ తీరదు."

"పద్మా!"

"అవునండీ, కాలవ్యవధి వుంటేకదా ఏదన్నా నేర్చుకోవటానికి అవకాశముండేది. నాకూ ... మృత్యువుకూ మధ్య..." ఆమె దుఃఖం పైకి పెల్లుబికింది. "అహ అట్టే వ్యవధి లేదండీ. అనే మాట ఆ దుఃఖంలో పూడుకుపోయింది.

శేఖర్ చేతిలోవున్న పద్మ వ్రేళ్ళు వణికాయి. ఆ వణికే వ్రేళ్ళ చుట్టూవున్న శేఖర్ చెయ్యి మరింత గట్టిగా బిగుసుకుంది.

వెర్రి ఆవేశం కలిగిందతనికి. ముందుకు వొంగి ఆమె నుదుటిని మృదువుగా చుంబించాడు. ఆమె తన రెండో చేతిని అతని తల వెనగ్గా పోనిచ్చి మెల్లిగా క్రిందకు లాక్కుంది. ఇప్పుడతని ముఖం ఆమె తడిసిన చెంపల్ని లేతగా రాసుకుంటోంది. అట్లా రాసుకుంటున్నప్పుడు ఆమె తెరిచివున్న కుడికంటికి తన తెరిచివున్న కుడికన్ను ఆనించి, అంత దగ్గరగా చూడటం అతని కిష్టం. ఆమె కంటినీటితో అతని కన్ను తడిసింది. అతని కంటి వెనక నీటితో అతని మనసు యిదివరకే తడిసింది. అట్లా ముఖంలో ఒక సగానికి తన ముఖంలో ఒక సగం ఆనించి పడుకుంటే అతని పెదవులు ఆమె చెవికి దగ్గరగా తిరిగాయి. అవధులులేని ఆంతర్యంలోని ప్రలోభాన్ని, వినిపించీ వినిపించనట్లున్న గొంతులో యిమిడ్చి అన్నాడు. "నువ్వు బ్రతుకుతావు పద్మా! బ్రతుకుతావు. నాకోసం...నన్ను సుఖపెట్టటం కోసం. నన్ను సుఖపెట్టటం లేదన్న నీ వేదన తీర్చుకోవటం కోసం...తప్పకుండా బ్రతుకుతావు."

ఆమె అతని చేతిలోని తన చేతిని మెల్లిగా విడిపించుకుంది. తన రెండు చేతుల్తోనూ అతని ముఖాన్ని పట్టుకుని తన ముఖానికి కొంచం దూరంలో వుంచుకుని తదేకంగా చూసింది.

"అందమైన, అమాయకమైన, నిర్మలమైన మీ ముఖం చూస్తుంటే...కరుణని కురిపించే మీ కన్నుల్ని చూస్తుంటే, నాకూ బ్రతకాలని ఆశగా వుందండీ. కాని...కాని...నాకా అదృష్టంలేదండీ"

"పోనీ ... కనీసం ... ఆ అదృష్టం నాకుంది."

రెండు నిమిషాలు నిశ్శబ్దంగా గడిచాయి. బయటి నీరెండ క్రమంగా అంతరించి చీకటి ఛాయలు అలుముకుంటున్నాయి. పద్మ వుంటూన్న ఎ. క్లాస్ రూమ్ చుట్టూ దట్టంగా చెట్లు ఆక్రమించి వున్న ప్రదేశంలో వుండేమో-అక్కడ ముందే చీకటిపడింది. శేఖర్ లేచి లైటు వెలిగించి వచ్చాడు.

పద్మ అంది. "అబ్బ! ఈ హాస్పటల్ వాతావరణం ఎంత భయమేస్తుందండీ, ఒక్కోరోజు ఒక్కో యుగంలా గడుస్తున్నది. డాక్టరుగార్ని త్వరగా ఆపరేషన్ చేసెయ్యమని చెప్పండి. ఈ విరామం భరించలేనండీ."

"డాక్టరుగారుకూడా చాలా ఆత్రుత పడుతున్నారు పద్మా. అవకాశంకోసం చూస్తున్నారు."

"అవకాశం అంటే? ఆరోగ్యవంతమైన మరోగుండె కోసమేగా? నాకు పునర్జన్మనిచ్చే నిమిత్తం మరో నిర్భాగ్యప్రాణి మరణంకోసం ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారన్నమాట!"

"అలా ఎందుకనుకోవాలి? ఏ విధంగానూ రక్షించలేని ఒక నిర్భాగ్యపు ప్రాణిని ఆసరా తీసుకుని, బ్రతికే ఆశ వున్న మరో నిర్భాగ్యురాలికి ప్రాణదానం

చెయ్యటం మంచిదే కదా! ఈ ప్రపంచంలో అనుకోనివి ఎన్నో జరుగుతూంటాయి. ఆ కారణంగా ఒకరిని రక్షించగలగటం నిజంగా అదృష్టమే."

మళ్ళీ కొంతసేపు నిశ్శబ్దం అలుముకుంది. పద్మ నిట్టూర్పువిడిచి అన్నది: "ఏమండీ! ఒక వేళ ... ఒక వేళ ... నేను బ్రతికితే–మరో గుండెతోవున్న నా శరీరంతో మీరు కాపరం చేస్తారన్నమాట."

అతను అప్రతిభుడయాడు. కాని ఇలాంటి ఆలోచనలను దరిచేరనివ్వదలుచుకోలేదతను. అందుకని వెంటనే తేరుకుని "గుండె ఎవరిదైతే ఏం పద్మా? ఆ గుండెని కదిలించే శక్తి నీదేగా" అన్నాడు.


"అవును. నాదే. నాదే" అన్నదామె, తనలో తాను అనుకుంటున్నట్లుగా. మెల్లగా లేచి, దిండు వెనక్కి జరుపుకుని ఆనుకుని కూర్చుంది. అనుకోకుండా తల ప్రక్కకి త్రిప్పిచూసేసరికి. కిటికీలోంచి దీపాల వెలుగులో నిండిపోయివున్న హాస్పిటల్ లాన్స్ కనిపించాయి. ఆ రమణీయ దృశ్యాన్ని దీపకాంతిలో తిలకించటం ఆమె కెంతో ఇష్టం. కళ్ళనిండా అభిరుచి నింపుకుని ఆమె అలా చూస్తోంటే, టిఫిన్ క్యారియర్ చేతిలో పట్టుకుని, లాన్స్ ప్రక్కనుండి నడిచిపోతోన్న ఆ యువతి కనిపించింది. ఆమె కన్నులు పెద్దవి చేసుకుని, పరిశీలనగా చూసింది. అవును. ఆ యువతే.

"ఏమండీ! అటు చూడండి" అన్నది ఆతృతతో భర్తకు చేయిపెట్టి చూపిస్తూ.

శేఖర్ అటువైపు చూసి "ఏమిటి పద్మా?" అన్నాడు అర్థంగాక.

"ఆ క్యారియర్ పట్టుకుని నడిచిపోతూన్న అమ్మాయినండీ. ఏమండీ! ఆ అమ్మాయి ఎంతో అందంగావుందికదూ."

ఆమె సంతృప్తికోసం అన్నట్లుగా "అవును" అన్నాడు.



"అమాయకంగా ... అందంగా ... లేతగా వుంది. ఆమెను మొదటిసారి చూడగానే నిన్న నాకు ఏమనిపించిందో తెలుసాండీ?"

అతను ప్రశ్నార్థంగా చూశాడు.

ఆమె అతనివంక చూడటంలేదు. "ఒక వేళ...ఒక వేళ...ఆపరేషన్‌లో నేను చనిపోతే...ఆమెను మీ ప్రక్కన ఊహించుకున్నానండీ. ఎంత అందంగా ఉందండి మీ జంట! మీ ఇద్దర్నీ నా కళ్ళముందు చిత్రించుకుంటే చూడటానికి నా రెండు కళ్ళూ చాలలేదు."

"పద్మా! పద్మా!!"

"ఆమె ఎవరో, ఎక్కడిదో ఏమీ తెలియదు. కాని ఆమెని చూస్తూంటే నాకా వింత కోరిక కలుగుతోంది. వింత ఆనందం కలుగుతోంది. మిమ్మల్ని ప్రాధేయపడతానుఆమెని నాకుపరిచయం చెయ్యండి."

శేఖర్ ఉద్వేగాన్నణుచుకుంటూ ఆమె మంచంమీదకువచ్చికూర్చుని ఆమె

రెండు చేతులూ గట్టిగా పట్టుకున్నాడు. "పద్మా!" నీకు పిచ్చిపట్టింది...నువ్వు"

పద్మ అతనివంకచూస్తూ పిచ్చిగా నవ్వింది. 'అవును నాకు పిచ్చిపట్టింది. అందుకే యిక్కడ ఎడ్మిట్ అయాను... ఇరవయ్యేళ్ళు నాతో పెరిగిన గుండె. యిరవైయ్యేళ్లు నన్ను పీల్చి పిప్పిచేసిన నా గుండె ... ఇప్పుడిహ దూరంగా పోతానంటే పిచ్చె ఎక్కుతోంది."

"పద్మా! నువ్విలా ఆయాస పడకూడదు. ప్లీజ్! నా మాట విను."

ఆమె అతని కళ్ళలోకి చూస్తూ ఏదో చెప్పబోయింది. అంతలోనే తృళ్ళిపడినట్లయి వర్ణించనలవికాని బాధతో "అబ్బా"అని అతనినుంచి తన చేతిని లాక్కుని గుండెను అదుముకుంటూ కళ్లు మూసుకుంది. అప్పటికప్పుడు ఆమె ముఖమంతా తెల్లగా పాలిపోయింది. శరీరమంతా స్వేదబిందువులు క్రమ్మివేశాయి.

పద్మకి ఎటాక్ వచ్చింది. బాధతో మెలికలు తిరిగిపోతోంది. చర్మంలోపలికి చెయ్యిదూర్చి గుండెను నిర్దయగా మెలి త్రిప్పి వేసినట్లుగా విపరీతమైన నొప్పి.

నిర్ఘాంతపోయి చూస్తున్న శేఖర్ హఠాత్తుగా తెలివి తెచ్చుకున్నాడు. "డాక్టర్!" అని అరుస్తూ బయటకు పరిగెత్తాడు.

*　　*　　*

పద్మ ఆ ఎటాక్‌నుంచి కోలుకోనటానికి డాక్టర్ రమేష్ కనీసం రెండు గంటలు ప్రయాస పడవల్సివచ్చింది. ఆ రెండు గంటల్లో ఆతృతతోకూడిన క్షణాలెన్నో గడవకపోలేదు. చిట్టచివరకు డాక్టర్ రమేష్ ముఖం వికసించింది. ఆమె ముఖాన్నోసారి నిమిరి "లకీ" అంటూ యివతలకు వచ్చి నుదుటనపట్టిన స్వేదబిందువులు తుడుచుకున్నాడు.

శేఖర్ కూడా బయటకువచ్చి ఆయన ముఖంలోకి ప్రశ్నార్థంగా చూస్తున్నాడు. అతని మనస్సులోని సందేహం పసిగట్టినట్లుగా డాక్టర్: "ఆమెగుండెఅంతా ఫైబ్రాస్ అయిపోయింది. ఇప్పటికి ఫర్వాలేదు. కాని ఏ క్షణంలోనైనా ప్రమాదం ముంచుకురావచ్చు. ఆపరేషన్ ఎంత త్వరగా చేయగలిగితే అంతమంచిది. మంచిగుండె మనకు దొరికిననాడు .." అన్నాడు.

డాక్టర్ వెళ్ళిపోయాక శేఖర్ తిరిగి గదిలోకి వెళ్ళాడు. అలిసిపోయిన పద్మ గాఢ నిద్రలో మునిగి కనిపించింది. అతను నిట్టూర్పువిడిచి కుర్చీని ఆమె మంచం దగ్గిరకులాక్కుని కూర్చున్నాడు.

*　　*　　*

అంతా క్షణంలో జరిగింది. కారు ఎంత బ్రేకువేసినా ఆమె మీదనుంచి దూసుకుపోయేదే. కళ్ళు మూసి తెరిచేటంతలో శేఖర్ ఆమె భుజం పట్టుకుని రోడ్డు ప్రక్కకి లాగేశాడు.

షాక్‌లోంచి తేరుకుని ఆమె కృతజ్ఞతాపూరితంగా అతనివంక చూసింది.

"థ్యాంక్స్. నన్ను రక్షించారు. మీరంత సమయస్ఫూర్తిగా ప్రక్కకి లాగి వేయకపోతే నేనేమై వుండేదాన్నో యీ పాటికి..."

ఆమె ముఖం వంక చూసి అతను ఉలికిపడ్డాడు. "మీరా?" అందామనుకుని ప్రయత్న పూర్వకంగా నిగ్రహించుకున్నాడు.

"మీరు చాలా పరధ్యాస మనుషులనుకుంటాను...దెబ్బలేమైనా తగిలాయా?" అనడిగాడు.

"లేదులేండి. మీరు గట్టిగా లాగబట్టి చెయ్యిమాత్రం కాస్త బెణికింది." అన్నదామె నవ్వుతూ.

అతనికికూడా కాస్త నవ్వు వచ్చింది. జనం వాళ్ళ చుట్టూ ప్రోగవుతున్నారు. అక్కడ నిలబడటం యిష్టంలేక 'రండి పోదాం' అన్నాడు.

ఇద్దరూ హాస్పటల్ వైపు నడవ సాగారు.

"మొత్తంమీద కాస్త నష్టం తప్ప లేదన్నమాట. మీ పేరు తెలుసుకోవచ్చా?"

"నీరజ."

"మీవాళ్ళెవరో హాస్పటల్‌లో ఎడ్మిట్ అయినట్లున్నారు. మీరు రోజూ క్యారియర్ తీసుకువస్తూంటే చూస్తున్నానులెండి."

అవునన్నట్లు ఆమె తల ఊపింది.

"ఎవరండీ. మీ బంధువులా?"

కాదన్నట్లు తలాడించింది.

"స్నేహితులా?"

"ఊహు."

"మరెవరండీ?...మీ...వారా?"

సిగ్గుతో ఆమె ముఖం అరుణ రాగ రంజితమైంది. అతనివంక చూడకుండా మెల్లగా అడుగులువేస్తూ "నేను...నేను చేసుకోబోయేవారు" అంది వినిపించీ వినిపించనట్లు.

"ఓ అలాగా! ఏమిటండీ వారికి?"

"జ్వరమండీ. టైఫాయిడ్ అన్నారు. తగ్గిపోయింది లెండి. రెండు మూడు రోజుల్లో డిశ్చార్జి చేసేస్తారు."

"వెరీగుడ్. మీకు చెయ్యి బెణుకు ప్రసాదించిన వార్ని పెళ్ళికి పిలవటం మరిచిపోకూడదు సుమండీ."

ఆమె నవ్వింది. "ఇంకానయం. మీరు కలగచేసుకోక పోతే అసలు మనిషినే గల్లంతయి వుండే దాన్ని." ఇంతలోనే ఏదో ఆలోచనవచ్చినట్లు ఆమె ముఖంలో రంగులు మారాయి. "కాని కారు ఏక్సిడెంట్‌లో నేను మరణించినా, బహుశా నావల్ల ప్రపంచానికి అపకారం జరిగివుండేది అంది మళ్లీ."

అతనామె వంక ప్రశ్నార్థంగా చూశాడు.

"గుండెనుమార్చే ఆపరేషన్ చేయటం కోసం ఓ స్త్రీని యీ హాస్పటల్‌లో చేర్పించారుట. మంచి గుండెకోసం డాక్టర్లంతా ఆతృతగా ఎదురు చూస్తున్నారుట నేను మరణించివుంటే బహుశా నాగుండె

అందుకు పనికివచ్చి వుండేది...అదేమిటి? హఠాత్తుగా అలా అయిపోయారేం ?"

ఒక్కక్షణం అతను సంకోచించాడు. "ఆ స్త్రీ నా భార్యే మిస్ నీరజా!"

ఆమె తృళ్ళిపడింది. అతని ముఖం వైపోసారి కళ్ళ కొనలనుంచి చూసి, మళ్ళీ తల త్రిప్పుకుని "...నన్ను రక్షించి నందుకు మీరిప్పుడు విచారిస్తున్నారా ?" అంది

అతను అప్రతిభుడై ఆగిపోయాడు ఆమెవంక తిరిగి మాట తడబడుతూండగా "మీరు ... మీరు ... నన్నింత మీన్‌గా తీసుకున్నారా?'' అన్నాడు.

తను తొందరపడి అతని మనస్సు నొప్పించి నందుకు ఆమె పశ్చాత్తాప పడింది. "క్షమించండి. మీరింత హర్ట్ అవుతా రనుకోలేదు. యథాలాపంగా అనేశాను.'' అంది.

"నేనంత స్వార్థపరుడిలా కనిపిస్తు న్నానా ?"

"మీ మనసు చాలా గాయ పరిచి నట్లున్నాను, ప్లీజ్! ఆ ప్రసంగం మరిచి పోండి..."


మళ్ళీ యిద్దరూ నడవసాగారు అయిదు నిమిషాలు గడిచేసరికి హాస్పటల్ గేటు దాటి లోపలకు ప్రవేశించారు.

నీరజ ముఖంలో కుతూహలం కన బరుస్తూ ''మరి......మీ శ్రీమతి ని చూపించండి నాకు" అనడిగింది.

"పద్మను మీరు చూస్తారా ?''

"అవును. ఈ ఆపరేషన్ గురించి నేను విన్నప్పట్నుంచీ ఆమెను చూడాలనీ, ఆమెతో పరిచయం చేసుకోవాలనీ ఎంతో కోరికగా వుండేది.'' అని అతను సందే హించటం చూసి ''ఏం? మీకు యిష్టం లేదా?" అనడిగింది.

ఆమె కేమని జవాబు చెప్పాలో తెలియక శేఖర్ ఆలోచిస్తున్నాడు. నిన్న పద్మకూ, తనకూ మధ్య జరిగిన సంభాషణ తన చెవుల్లో యింకా ప్రతిధ్వనిస్తోంది.




పరిస్థితి యింతచిత్రంగా చుట్టుకువస్తుందని తను కలగన్నాడా ?

"పోన్లెండి. మీ కిష్టం లేకపోతే వద్దు లెండి," అంటోంది నీరజ దెబ్బతిన్నట్లుగా.

అతను గుండె నిబ్బరం చేసుకున్నాడు "రండి వెడదాం కాని ఆమె మనస్థిమితం లేక ఏవేవో మాట్లాడుతూంటుంది. అవన్నీ మీరు పట్టించుకోకూడదు" అన్నాడు.

"అలాగే" ఆమె తల ఊపింది.

"మరో కోరిక కూడా ఉంది. మీరు ఈ హాస్పటల్‌కి ఎందుకోసం వస్తున్నారో ఆమెకి నిజం చెప్పండి. మీ స్నేహితు లనో, బంధువులనో చెప్పండి. ఇలా నే నడుగు తున్నందుకు కారణం ప్రశ్నిస్తే జవాబు చెప్ప లేను !

ఆమె ఆశ్చర్యపోతూ అతని వంక చూసింది. ఏవేవో ప్రశ్నలు చెలరేగాయి ఆమెలో. కాని ఆమె సభ్యతగల యువతి. గుప్తంగా ఉంచబడిన విషయాలని తరచ టానికి ఆమె సంస్కారం ఒప్పుకోలేదు.

"అలాగే" అంది మళ్ళీ.

* * *

శేఖర్‌కి ఎప్పుడూ అవే మాటలు గుర్తుకువచ్చి గుండెను తొలుస్తూ ఉంటాయి.

"ఒక వేళ...ఒక వేళ... ఆపరేషన్‌లో చనిపోతే ..ఆమెను మీ ప్రక్కన ఊహించు కున్నానండి. ఎంత అందంగా ఉందండీ మీ జంట. మీ ఇద్దర్నీ నా కళ్ళముందు చిత్రించుకుంటే చూడ్డానికి నా రెండు కళ్ళూ చాలలేదండీ.''

నీరజ గొంతు అతని చెవిలో గుసగుస లాడుతుంది. "ఆమె మీ భార్యా? నన్ను రక్షించినందుకు మీ రిప్పుడు విచారిస్తు న్నారా?''

"నిజంగా నే నంత స్వార్థపరుడ్నా? అలాంటి విచారం నాకు కలిగిందా?''

"నిజం చెప్పండి. మీకు విచారంగా లేదూ ?...మీకు విచారంగా లేదూ ?''

"లేదు...లేదు...లేదు నీరజా: నా కంత క్రూరంగా ఆలోచించటం చేత కాదు.''

అత న్ని సంఘర్షణ నలిపేస్తోంది, మన శ్శాంతి లేకుండా చేస్తోంది.

* * *

రెండురోజుల్లో పద్మా, నీరజా ఎంతో సన్నిహితు లయిపోయారు. ఊహకు అందని దేదో వా రిద్దర్నీ అంత గాఢంగా కలిపేసింది. నీరజను తన గదినుంచి కదల నివ్వటం లేదు పద్మ.

"నీరజా! నువ్వు అపురూపమైన దేవతవి... దేవతలు వరమిస్తారు. అవునా?

నీరజ, ఆమె మంచంమీదనే కూర్చుని ఆమె కళ్ళలోకి చూస్తోంది. అది మూడవ రోజు జరుగుతూన్న సంఘటన.

"అక్కా!" అంది చలించి, ఆర్ద్రస్వరంతో.

"అక్క. ఎంత హాయిగా ఉన్నదమ్మా నీ పిలుపు?''

"ఆ హాయి నా పిలుపులో లేదక్కా. నీ హృదయంలో వుంది."

"ఊ...నీ మాటలు మల్లెలతోరణం కాదా? మరి నా వరం మాటేం చేశావు?"

"నేనా? నీకు వరమివ్వటమా?"

"అవును, నేడో రేపో నాకు ఆపరేషన్ జరుగుతుంది. అది జరిగాక బ్రతికి బయటపడతానని నాకు నమ్మకం లేదు. బ్రతికుండి మావారి జీవితానికి సుఖం లేకుండా చేశాను. చచ్చికూడా ఆయనకు శాంతిలేకుండా చెయ్యలేను."

నీరజ ఆమె నుదుటిమీద చేయివేసి నిమిరింది. "అలా అనకండి. మీకు ఆపరేషన్ జయప్రదంగా జరుగుతుంది." అంది ధైర్యం చెబుతూ.

"నా కా నమ్మకం లేదు నీరజా! నా జీవితం ముగింపుకు వచ్చేసింది. తర్వాత ఆయనకు..." పద్మ ముఖంలో కొత్త కాంతి ప్రవేశించింది "నువ్వే రక్ష నీరజా!

"అక్కా!"

"అవును ఈ వరమే నేను కోరేది. వారికి అంతులేని ఐశ్వర్యం వుంది. విద్యాసంపన్నులు. సంస్కార సౌందర్యం, ఆరోగ్యం వున్నాయి. వయస్సులోకూడా చాలా చిన్నవారు. నీ కింకా పెళ్ళి కాలేదు. ఎవర్నో ఒకర్ని పెళ్ళిచేసుకోక తప్పదు.

"అక్కా నేను..."

"అవును" చెప్పగానే నీకు కంగారుగానే వుంటుంది. ఆలోచించుకో నీరజా. ఆలోచించినకొద్దీ ఆయన ఔన్నత్యం నీకు బోధపడుతుంది. ఒక్క విషయం మాత్రం గర్వంగా చెబుతున్నాను. ఈ అదృష్టం అందరికీ దక్కదు సుమా"

"అక్కా!" నీరజ ఆమె ప్రక్కనే వాలిపోయి దిండులో ముఖం దాచుకుని వెక్కి వెక్కి ఏడ్చేసింది.

పద్మ తన చేతుల్ని ఆమె వీపుమీద వుంచి ప్రేమగా నిమిరింది. "పిచ్చిపిల్లా! ఏడుస్తున్నావా? పెళ్ళిమాట చెప్పగానే భయమేసిందా?''

నీరజ ఏడుస్తూనే ఆమెకు దగ్గరగా జరిగి "మీరు...మీరు...బ్రతికి తీరాలి." అంది ఆమె చేతిని గట్టిగా పట్టుకుని.

ఆ చేతిస్పర్శ ననుభవిస్తూ పద్మ ఆర్ద్రస్వరంతో చెప్పసాగింది "నీ చల్లని మనసు అదే కోరుకుంటుంది నీరజా నాకు తెలుసు. కాని ఒక్కోసారి కోరికలకూ, జరిగే సంఘటనలకూ సంబంధం వుండదు కదమ్మా. నీ అనుగ్రహం వుంటేచాలు. వాగ్దానాలు చెయ్యనక్కర్లేదు. నువ్వు దేవతవు...నాకు తెలుసు. నువ్వు అమృతమే పంచిపెడతావు."

శేఖర్ ఆనాడు ఎందుకు తనని యీమెకు పరిచయం చెయ్యటానికి సంకోచించాడో అర్థంచేసుకుంటూ, కనులు మూసుకుని ఆమె మాటల్ని ఆలకిస్తోంది నీరజ.

* * *

ఆ మరునాడు డాక్టర్ రమేష్ తన అసిస్టెంట్లయిన ఆరుగురి డాక్టర్లని దగ్గర కూర్చోబెట్టుకుని హార్ట్‌ట్రాన్స్‌ప్లాంటేషన్ గురించి లోతుగా చర్చిస్తున్నాడు. ఆపరేషన్ ఏ విధంగా జరగాలో, ఏయే జాగ్రత్తలు తీసుకోవాలో అన్నీ వివరిస్తున్నాడు. అందరికీ ఉత్సాహం ఉరకలు వేస్తోంది. తమ హాస్పటల్‌లో యిది సరికొత్త ప్రయోగం. డాక్టర్ రమేష్ శక్తి సామర్థ్యాలమీద అందరికీ నమ్మకం, గురి వున్నాయి. తామందరూకూడా అతి స్వల్ప విషయంలోకూడా జాగ్రత్తతీసుకుని అతన్తో సహకరించాలి. ఈ ప్రయోగం విఫలమైతే తామందరికీ చెడ్డపేరు వస్తుంది. ఈ విద్యుక్తధర్మం అందర్నీ కుదిపేస్తోంది.

అంతలో అక్కడికి ఓ నర్స్ కంగారు కంగారుగా వచ్చింది.

డాక్టర్ రమేష్ మాట్లాడటం ఆపి ఆమె వైపు ప్రశ్నార్థకంగా చూశాడు.

''డాక్టర్. క్యాజువాలిటీ వార్డుకి కారు యాక్సిడెంట్ కి గురైన ఓ స్త్రీని తీసుకువచ్చారు. అక్కడ సర్జన్ ఆమెను పరీక్షచేశాక తల అంతా చితికిపోయిందనీ, యింకా ఎంతోసేపు జీవించదనీ చెప్పి- యీ కేసు ఆపరేషన్ కి పనికి వస్తుందేమో చూడటానికి మిమ్మల్ని వెంటనే తీసుకు రమ్మన్నారు.''

డాక్టర్ రమేష్ ఆతృతగా లేచి నిల్చున్నాడు. ''పద.''

గబగబ వార్డులన్నీ దాటుకుంటూ క్యాజుయాలిటీ వైపు దారి తీశాడు... అయిదు నిమిషాల్లో అక్కడికి చేరుకున్నాడు.

ఆ యువతి బల్లమీద పడుకోబెట్టబడి వుంది. ఇరవయ్యేళ్ళ కన్నా ఎక్కువ వుండవు. తల దెబ్బతిని, మెదడుకు తీవ్రంగా గాయంకాగా ఆఖరి క్షణాలలో వున్నదామె.

అందంగా, లేతగా వున్న స్త్రీ. డాక్టర్ రమేష్ ఆమెవంక బాధగా, జాలిగా చూశాడు. ''పూర్ లేడీ'' తనలో తను గొణుక్కున్నాడు.

మరుక్షణంలో కర్తవ్యంతో ప్రబోధితుడై గంభీరస్వరంతో "ఎలెక్ట్రోకార్డియోగ్రాం మిగతా అన్ని టెస్టులూ పూర్తిచేయండి. ఈమె తరఫువారెవరైనా వుంటే వాళ్ళకు విషయం బోధపర్చి, అనుమతి తీసుకోండి. క్విక్'' అన్నాడు. ప్రక్క గదిలోకి వెళ్ళి సిగిరెట్ కాల్చుకుంటూ కూర్చున్నాడు.

ఓ అరగంట గడిచాక అతని అసిస్టెంటు

ఒకరు వచ్చి ఎలెక్ట్రోకార్డియోగ్రాం రిపోర్టు, మిగతా ఫలితాలు అందిచ్చాడు. అవి చూశాక డాక్టర్ రమేష్ ముఖం వికసించింది. గుడ్ ఈమె గుండె మంచి స్థితిలోవుంది. ఈమెను వెంటనే ఆపరేషన్ థియేటర్ కు మళ్ళించండి. పద్మనుకూడా తీసుకురండి థియేటర్ కి" అంటూ ఆజ్ఞలు యిచ్చాడు.

* * *

పద్మని థియేటర్ కు స్ట్రెచర్ మీద తీసుకువెడుతూంటే "ఏమండీ నేను వెళ్ళి పోతున్నానండీ, వెళ్ళిపోతున్నాను'' అంది కళ్ళ నీళ్ళు కారుతూండగా.

"మళ్ళీ తిరిగివస్తావు పద్మా. తప్ప కుండా" అన్నాడు శేఖర్ దుఃఖం ఆపు కుంటూ.


"మళ్ళీ తిరిగి...మళ్ళీ తిరిగి..." ఆమె దూరమైపోయింది.

శేఖర్ ఆపరేషన్ జరిగేచోటుకు పోలేదు. గదిలో కిటికీముందు కుర్చీలో కూర్చుండిపోయాడు. గాలికి కిటికీతెరలు ప్రక్కకి తొలగినప్పుడల్లా దూరంగావున్న హాస్పటల్ లాన్స్ కనిపిస్తున్నాయి.

థియేటర్ లో ప్రక్క-ప్రక్క గదుల్లో పద్మనీ, ఆ రెండో యువతినీ పడుకోబెట్టారు. డాక్టర్లు, నర్సులు ఎవరి పనుల్లో వారు హడావుడిగా ఉన్నారు. పద్మకోసం అవసరమైనప్పుడు ఇవ్వటానికి సీసాలనిండా రక్తం సిద్ధం చేయబడింది.

పద్మకి డాక్టర్ రమేష్, మరో ఇద్దరు అసిస్టెంట్లూ అటెండ్ అవుతున్నారు. మిగతావారు ఆ రెండో యువతి దగ్గర వుండి ఆమె శరీరంనుండి గుండెను తీసి వేయటానికి సర్వ సన్నాహాలూ చేస్తు న్నారు. ఆమె గుండె ఆగిపోబోతోంది.

ఒక డాక్టరు ఆమె తొడలోని రక్త నాళాలూ, కంఠసీమలోని రక్తనాళాలూ డిసెక్ట్ చేసి సిద్దంగా వుంచాడు. గుండెలో కదిలక తక్కువై పోతోంది. అంతిమశ్వాస తీసుకుంటోంది రోగి.




సరిగ్గా ఆ సమయానికి డిసెక్ట్ చేసిన రక్తనాళాలగుండా, శరీరంలోని రక్తం గడ్డకట్టకుండా హెపారిన్ ఎక్కించేశారు. తర్వాత ఒకటి రెండు క్షణాలకు గుండె ఆగిపోయింది. ఆ యువతి చనిపోయింది. వెనువెంటనే రక్తనాళాలకు కలపబడి వున్న హార్ట్ లంగ్ మిషన్ ఆన్ చేయబడింది. మళ్ళీ గుండె కొట్టుకోసాగింది. రోగి మాత్రం మరణించే వుంది.

గుండెచుట్టూ వున్న రక్తనాళాలన్నీ ఎక్కడికక్కడ లిగేట్ చేసేశారు. రక్త స్రావం కాకుండా. తర్వాత గుండెను వాటినుంచి కోసేసి శరీరంనుంచి విడదీసి ప్రక్కనే చిన్న బేసిన్ లోవున్న ద్రవంలో ఉంచారు.

ఇది జరిగేసమయానికి మొదటి థియే టర్ లో మత్తు ఇవ్వబడిన పద్మకు డాక్టర్ రమేష్ ఇదే పద్ధతిలో గుండె తీసివేస్తు న్నాడు. ఆక్సిజన్ వెడతోంది. శరీరం లోకి రక్తం ఎక్కుతోంది. 'అతని వ్రేళ్ళు చకచకా, కార్యదీక్షతో, విశ్వాసంతో పనిచేస్తున్నాయి...చివరకు ఆమె గుండె తీసివేయబడింది. శరీరంలో గుండె లేక పోయినా రక్తనాళాలకు కలపబడ్డ హార్ట్ లంగ్ మిషన్ ద్వారా రక్తప్రసారం జరుగుతోంది.

అతని సౌంజ్ఞ అందుకోగానే ప్రక్క థియేటర్ లోంచి ఆ యువతి గుండె తీసుకురాబడింది. దాన్ని తీసుకుని పద్మ హృదయంలో అమర్చాడు డాక్టర్ రమేష్. సరిగ్గా యిమిడిందోలేదో చూసి చుట్టూవున్న రక్తనాళాలతో కలిపి కుట్లు వేసేశాడు. హెచ్చుతగ్గులుగా వున్న చోట సరిపోయేటట్లు కత్తిరించాడు. తర్వాత అంతకుపూర్వం రక్తనాళాలను మూసేస్తూ కుట్టినకుట్లు విప్పేశాడు.

కొత్తగుండెలోకి రక్తం ప్రవహించింది.

చుట్టూ చేరి అంతా ఊపిరిబిగబట్టి చూస్తున్నారు.

హార్ట్ లంగ్ మిషన్ పనిచేస్తూనేవుంది.

కొత్తగుండె కదలడం మొదలు పెట్టింది. మెల్లిగా కొట్టుకుంటోంది. లబ్...డబ్... లబ్...డబ్.

అందరి ముఖాలూ వికసించినట్లు మాస్కులపైనుండి మెరిసే కళ్ళలోని కాంతివ్యక్తం చేసింది. ఆపరేషన్ సక్సెస్ అయిందా? తాము విజయంసాధించారా?

గుండె క్రమబద్ధంగా, లయబద్ధంగా కొట్టుకుంటోంది.

డాక్టర్ రమేష్ తృప్తిపడి గుండె పైన చర్మం కుట్టేశాడు.

హార్ట్ లంగ్ మిషన్ ఆపేసినా గుండె కొట్టుకుంటుందా? కొట్టుకోవాలి లేక పోతే యీ శ్రమంతా వృధా. ఓ గంట గడిచాక భయభయపడుతూనే మిషన్ ఆపేశారు. గుండె ఎలా పనిచేస్తుందో చూడటానికి ఎలెక్ట్రోకార్డియోగ్రాం తగిలించారు. ఆతృతగా చూస్తున్నారు.

గుండె కొట్టుకుంటూనేవుంది, ఆగ లేదు.

అయినా తొందరపడకూడదు, ఓపిగ్గా చూడాలి.

పది నిముషాలు గడిచాక గుండె వేగం తగ్గుతున్నట్లు కనిపించింది. చలనం ఆగిపోయేటట్లు కనిపించి డాక్టర్ ఉలికి పడ్డాడు. వెంటనే మిషన్ ఆన్‌చేశాడు.

మళ్ళగుండె సక్రమంగా ఆడసాగింది.

ఇలా నాలుగయిదుసార్లు చేసేసరికి యిహ మిషన్ అవసరం లేకుండా గుండె స్వయం సంచలనాన్ని సాధించింది.

సక్సెస్ ! ఆపరేషన్ సక్సెస్, డాక్టర్ రమేష్ విజయగర్వంతో థియేటర్‌లోంచి బయటకునడిచాడు. మాస్క్ తీసేశాక డస్సిపోయిన అతని ముఖంలో అపూర్వ మైన వెలుగు గోచరించింది.

* * *

పదిరోజులు గడిచేసరికి ఏ విషపరిణా మాలూ కనిపించకపోయేసరికి పద్మ ప్రాణాని కెటువంటి భయమూలేదని నిర్ధారణకు వచ్చేశారు ... పత్రికలన్నీ యీ విషయాన్ని ఘనంగా రాశాయి. దేశం వింతగా చెప్పుకుంది.

పద్మకు మాట్లాడటానికి అనుమతి యిచ్చాడు.

శేఖర్ ఆమె ప్రక్కనే కూర్చున్నాడు. బయట ఎర్రటి సంధ్య చెట్లమీదుగా వ్యాపిస్తోంది. తెరచివున్న కిటికీలోంచి దూరంగావున్న లాన్స్ కనిపిస్తున్నాయి.

ఆమెవంక వెలిగే కళ్ళతో చూస్తూ అన్నాడు. "పద్మా! నేనే గెలిచాను నిన్ను తిరిగిపొందాను. నువ్వు పునర్జన్మ పొందావు."

పద్మ కళ్ళలో ఏదో దిగులు కని పిస్తోంది. ఆమె మనసుని తొలిచే విషయం ఒకటుంది. "ఏమండీ! నీరజ ఎక్కడ వుందో వెదికి తీసుకురండి. ఆమె పట్ల నే నపచారంచేశానండీ. నేను మరణిస్తానను కుని...ఆమెను...ఓ వరం..." పూర్తి చెయ్యలేకపోయింది.

శేఖర్ ఉలికిపడ్డాడు. అతని ముఖంలో వెలుగు అంతరించింది.

"మాట్లాడ రేమండీ ? నీరజ ఎక్క డుందండీ?"

నీరజ! అంత పరాకు మనిషిని రెండవ సారి కారు ఏక్సిడెంట్‌నుండి ఎవరు తప్పి స్తారు? అంతబలహీన స్థితిలోవున్న పద్మకు ఎలా యీ విషయం చెప్పటం ? చెబితే తట్టుకుంటుందా ?

"నీరజ...ఎక్కడుంది? నీ గుండెలోనే వుంది. నీరజ గుండెనే నీకు అమర్చారని ఎలా చెప్పను పద్మా?" అతను తనలో తను నలిగిపోతున్నాడు. ★

